అందరికీ అందుబాటులో ఉంటా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

గోల్కొండ: అందరికీ అందుబాటులో ఉంటూ అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. సోమవారం ఆయన మెహిదీపట్నం పద్మనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగర మేయర్‌గా, అహ్మద్‌నగర్, మెహిదీపట్నం కార్పొరేటర్‌గా ప్రజలు తనను ఎన్నుకున్నారన్నారు. తన పనితీరును మెచ్చుకున్న ప్రజలు తనను నాంపల్లి ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. పేదలు నివసించే ప్రాంతాలను ఎక్కువ ఫోకస్ చేసి ఆ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఆయన అన్నారు. మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తనపై నమ్మకం ఉంచి నాంపల్లి టికెట్ ఇచ్చారన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు

గన్‌ఫౌండ్రీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దివ్యాంగ మహిళ రజినికి ఉద్యోగాన్ని ఇస్తూ తొలి సంతకం చేయడంపై రాష్ట్రపతి పురస్కార గ్రహీత డాక్టర్ పద్మావతి సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగ మహిళలకు చేయూతనిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగ మహిళల కోసం ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఆ శాఖను స్వతంత్రంగా బలోపేతం చేయాలని పేర్కొన్నారు.

కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న క్రాంతి కుమార్ దంపతులు

గౌలిపురా: తుంటికి ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతిలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఎస్.పి.క్రాంతి కుమార్, శైలజా దంపతులు గౌలిపురా ఛత్రినాకలోని లక్ష్మీనారాయణ ఆలయం, శివాలయంలో ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భరత్ కుమార్, కరణ్ కుమార్, సాయి కుమార్, రితేష్, ఆలయ ట్రస్టీ, పూజారి శేషాద్రి అయ్యంగర్ పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జూపల్లి కృష్ణారావును నటరాజ్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లగిరి, యువ రచయిత మహ్మద్ ఖాజ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

సాంకేతిక విద్యాభివృద్ధికి సహకారం అందించాలి

విజయనగర్‌కాలనీ: రాష్ట్రంలో సాంకేతిక విద్యాభివృద్ధికి ప్రభుత్వం సహకారాన్ని అందించాలని తెలంగాణ గెజిటెడ్ పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.నర్సయ్య గౌడ్ కోరారు. మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని అసోసియేషన్ హాల్‌లో సోమవారం టీజీపాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ చక్రవర్తి, కోశాధికారి బి.రాజ తదితర సభ్యులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ పోరాటంలో తమతో పాటు విద్యార్థులతో కలిసి సమష్టిగా చేసిన పోరాటం మరువరానిదన్నారు. పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులకు త్వరితగతిని ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వై.కృష్ణ, డి.వెంకటేశ్వర్లు, డాక్టర్ కె.చంద్రశేఖర్, వి.సురేష్, పి.ఆనంద్, కె.వెంకన్‌గౌడ్, కె.వినోద్‌కుమార్, జి.విజయ్‌కుమార్, బి.కృష్ణవేణి, జి.రజితదేవి, డాక్టర్ ఎం.సునిత, జి.దీపికారెడ్డి పాల్గొన్నారు.

'నాణ్యమైన ఉత్పత్తులు అందిస్తాం'



గన్‌ఫౌండ్రీ: వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే తమ లక్ష్యమని గ్రోయింగ్ స్టార్ జువెల్లరీ చైర్మన్ మహేష్ జాజు తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్, సికింద్రాబాద్‌లో నూతన షోరూమ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నేటి వరకు ఐదు షోరూమ్‌లను ప్రారంభించామని రాబోయే రోజుల్లో మరింత విస్తరిస్తామని తెలిపారు. సిల్వర్ కింగ్‌డమ్ నాణ్యతకు మరోపేరు అని ఆ నమ్మకాన్ని వినియోగదారుల వద్ద నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐబీజేఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రా శ్రీనివాసరావు, బూర్గు సూర్యప్రకాష్ రావు, సురేష్ కొటాటి పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాంపల్లి రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సనత్‌నగర్-భరత్‌నగర్ రైల్వే స్టేషన్ల మధ్యలో ఓ గుర్తు తెలియని వ్యక్తి(35) రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామ నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటును ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈ-పెట్టీ కేసులో ఇద్దరికి జైలు

అబిడ్స్: ఈ-పెట్టీ కేసుల్లో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు వ్యక్తులకు న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ షేక్ ముజీబ్ ఉర్ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం..సత్యనారాయణ కాలనీలో నివసించే విజయ్ సింగ్‌కు రెండు రోజుల జైలు శిక్ష, డి.చంద్రమోహన్‌కు ఒక్కరోజు జైలు శిక్ష విధిస్తూ 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ సత్యనారాయణ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ ముజీబ్ ఉర్ రెహ్మాన్ మాట్లాడుతూ..వ్యాపారస్థులు కానీ, హోటళ్ల నిర్వాహకులు, ఇతర వాణిజ్య సముదాయాల వారు తప్పనిసరిగా పోలీసు నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ-పెట్టీ కేసుల్లో జైలు శిక్ష విధిస్తున్నారని ప్రతి ఒక్కరూ చట్టబద్ధతతో మెలగాలన్నారు.


అద్భుత కళాఖండాలకు నిలయం..

సాలార్‌జంగ్ మ్యూజియం

సాలార్‌జంగ్ అనేది నిజాం ఇచ్చిన బిరుదు

- మూడో సాలార్‌జంగ్ సేకరించిన వస్తువులతో మ్యూజియం ఏర్పాటు
- ఈనెల 16న సాలార్‌జంగ్ మ్యూజియం వ్యవస్థాపక దినోత్సవం


దివాన్‌దేవిడీలోని పాత సాలార్‌జంగ్ మ్యూజియం



చార్మినార్: అద్భుత కళాఖండాలకు నిలయం సాలార్‌జంగ్ మ్యూజియం. ఈనెల 16న సాలార్‌జంగ్ మ్యూజియం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి మ్యూజియం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నారు. సాలార్‌జంగ్ మ్యూజియం నయాపూల్-దారుషిఫా రోడ్డులో ఉంది. ఇది మన దేశంలోని ప్రసిద్ధిగాంచిన మ్యూజియంలలో మూడవది. మొదట ఈ మ్యూజియంను దివాన్‌దేవిడీలో 1951 డిసెంబర్ 16న అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించి అద్భుత కళాఖండాలను దేశ ప్రజలకు అందించారు. అందుకే ప్రతి ఏటా డిసెంబర్ 16న వ్యవస్థాపక దినోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ఆనవాయితీ. 1953లో భారత ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ దివాన్ దేవిడీలోని అప్పటి సాలార్‌జంగ్ మ్యూజియాన్ని సందర్శించి విజిటర్ బుక్‌లో సాలార్‌జంగ్ మ్యూజియంలోని కళాఖండాలు అద్భుతమైనవని రాశారు.

36 దేశాల నుంచి సేకరించి..

సాలార్‌జంగ్ అనేది నిజాం ప్రభువులు ఇచ్చిన బిరుదు. మీర్ తురబ్ అలీ ఖాన్, మీర్ లాయక్ అలీ ఖాన్, మీర్ యూసఫ్ అలీ ఖాన్ బహదూర్ సేకరించిన వస్తువులతో సాలార్‌జంగ్ మ్యూజియంను ఏర్పాటు చేశారు. మూడో సాలార్ జంగ్ అయిన మీర్ యూసఫ్ అలీ ఖాన్ బహదూర్ నిజాం ప్రభువుల వద్ద ప్రధాన మంత్రిగా విధినిర్వహణ కొనసాగించారు. ఆయనకు వస్తువులను సేకరించడమంటే ఎంతో ప్రీతి. ఐరోపా, మధ్య ఆసియాలోని 36 దేశాల నుంచి ఆయన సేకరించిన సుమారు 43 వేల వస్తువులను, దాదాపు 50 వేలకు పైగా పుస్తకాలను, తాళపత్ర గ్రంథాలను సాలార్‌జంగ్ మ్యూజియంలో పర్యాటకుల సందర్శనార్థం ప్రదర్శనకు ఉంచారు. వీటిలో 30 శాతం వరకు కళా ఖండాలే. 1876లో ఇటలీ శిల్ప కళానైపుణ్యంతో రూపుదిద్దుకున్న రెబెకా, 19వ శతాబ్దంలో ఇంగ్లాండ్ నుంచి తీసుకువచ్చిన మ్యూజికల్ గడియారం, ఫ్రాన్స్ నుంచి 1876లో సేకరించిన మెఫిస్టోఫలస్-మార్గరెట్టా (డబుల్ స్టాచ్యు) విగ్రహాలు ముఖ్యమైనవి.

ఎన్నెన్నో అద్భుత కళాఖండాలు..

సాలార్‌జంగ్‌లు సేకరించిన వస్తువులలో ఎక్కువ భాగం కొన్నవి కాగా, మరికొన్ని బహుమతులుగా అందుకున్నవి. అందులో ప్రధానమైనది మేలి ముసుగు సుందరాంగి రెబెకా. మ్యూజికల్ గడియారాన్ని సేకరించింది మాత్రం మొదటి సాలార్‌జంగ్ మీర్ తురాబ్ అలీఖాన్. వీటితో పాటు


మూడో సాలార్‌జంగ్ విగ్రహం

14, 15, 16వ శతాబ్దాలకు చెందిన విగ్రహాలు ఉన్నాయి. రెబెకా విగ్రహాన్ని ఇటలీ శిల్పి రూపొందించగా, మ్యూజికల్ గడియారానికి సంబంధించిన వస్తువులను ఇంగ్లాండ్ నుంచి తీసుకొచ్చి కలకత్తాలో బిగించారు. ఇవే కాకుండా ఫ్రాన్స్‌కు చెందిన 16వ తాయి టిప్పుసుల్తానుకు బహూకరించిన దంతపు కుర్చీలు ఉన్నాయి. వీటిలో టిప్పుసుల్తాన్ తన వస్తువులపై వాడే పెద్దపులి నమూనా కూడా ఉంటుంది. ఫ్రాన్స్‌కు చెందిన ఒకే విగ్రహంలో రెండు రూపాలుగా మలిచిన మెఫిస్టోఫిలస్-మార్గరెట్టా విగ్రహం అందాల్ని చూడాల్సిందే తప్ప వాటిని వర్ణించలేం. వీటితో పాటు రామాయణ, మహాభారత ఇతిహాసాలను తెలిపే కళాకృతులూ ఉన్నాయి. శివపురాణం గురించి తెలిపే ఏకైక కళాకృతి ఉన్నది ఈ మ్యూజియంలోనే. లండన్‌కు చెందిన సోలింజన్, హెన్రీ మెల్కిన్‌సన్ పాల్‌మాల్ కంపెనీలు తయారు చేసిన ఆయుధాలు ఉన్నాయి. 14, 15, 16 శతాబ్దంలో ఫ్రాన్స్ చక్రవర్తులు, నెపోలియన్ వాడిన వస్తువులతో పాటు క్రీ.శ.1288లో రాసిన ఖురాన్ రాత ప్రతులను ఇక్కడ జాగ్రత్తగా భద్ర పరిచారు. నాలుగో శతాబ్దం నాటి విష్ణు విగ్రహాలు విజయనగర రాజు కాలం నాటి నటరాజ విగ్రహం, శిలలపైన సింహాలు, గద్రాలు, ఎద్దులను మలిచిన తీరు అద్భుతంగా ఉంటుంది. ఇవేగాకుండా దేశంలోని సాంచి, బుద్ధగయ, అమరావతి, నాగార్జున కొండ, నేలకొండపల్లి నుంచి సేకరించిన బుద్ధుడి విగ్రహాలు.. ఇలా మరెన్నో అపురూప కళాఖండాలు సాలార్‌జంగ్ మ్యూజియంలో కొలువుదీరాయి.

చిన్నారుల విభాగం..

సాలార్‌జంగ్ మ్యూజియంలో చిన్నారుల కోసం ప్రత్యేక విభాగం ఉంది. ఇందులో విజ్ఞానాన్ని అందించే వస్తువులతో పాటు అబ్బుర పరిచే వస్తువులూ ఉన్నాయి. వీటిలో పొట్టిగా ఉండే బుద్ధ విగ్రహాలు, ఒకపక్క నుంచి చూస్తే మనిషి, మరోపక్క నుంచి చూస్తే గాడిద కనబడే విధంగా రూపొందించిన చిత్రం అద్భుతంగా ఉంటుంది. చిన్నారులను ఇదెంతగానో అలరిస్తుంది. అలాగే బెరియోన్ రూపొందించిన క్లియోపాత్ర, ఇటాలియన్ చిత్రకారుడు రూపొందించిన బెబె చిత్రాలు (చిన్నారుల కోసం) ఇక్కడ ఉన్నాయి.

ఆకట్టుకున్న ఇంద్రలోక్ ఫ్యాషన్ షో

గోల్కొండ: గోల్కొండ తారామతి-బారాదరిలో జరిగిన ఇంద్రలోక్ ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. సుచిరిండియా సీఈవో లయన్ కిరణ్ ఆధ్వర్యంలో ఈ ఫ్యాషన్ షోలో ఇంద్రలోకాన్ని తలపించింది. దేవకన్యల వేషంతో పాటు వివిధ రకాల దేవతల ఆయుధాలతో మోడల్స్ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫన్ డ్యాన్స్, పలువురు సినీ తారలు, మోడల్స్ ఆకట్టుకున్నారు. నటులు సాయికుమార్, అనూప్ రూబెన్స్, ఆర్‌పీ పట్నాయక్, సోహెల్ కన్షిక, మధుసుధన్ తదితరులు పాల్గొన్నారు.


తారామతి-బారాదారిలో జరిగిన ఫ్యాషన్ షో

ప్రజా సేవకే జీవితం అంకితం


సురేష్‌కుమార్‌కు కాకతీయ మహానంది పురస్కారం అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: సమాజ సేవకే జీవితం అంకితమని సంఘ సేవకుడు బొడ్డు సురేష్‌కుమార్ పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టిన బొడ్డు సురేష్‌కుమార్‌కు కాకతీయ మహానంది పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొడ్డు సురేష్‌కుమార్ మాట్లాడుతూ..20 ఏళ్లుగా నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కరోనా మహమ్మారి సమయంలో నిరుపేదలకు చేయూతనందించడం ఎంతో తృప్తిగా ఉందన్నారు. తన సేవలను గుర్తించి ఏఎస్ఎస్ 24 టీవీ గొంతుకల వేదిక కాకతీయ మహానంది పురస్కారం అందించి తనను సత్కరించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. తన జీవితాంతం వివిధ రంగాల్లో పేద బడుగువర్గాల ప్రజలకు విశిష్ట సేవలందిస్తానని ఆయన అన్నారు. పురస్కారం అందజేసిన నిర్వాహకులు టీవీ అశోక్‌కుమార్, హనుమాన్ల నాగరాజు, వనపర్తి పద్మావతికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తనకు అందించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టమే తన ముఖ్యోద్దేశమన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు


త్రయంబకేశ్వర ఆలయంలో..

విజయనగర్‌కాలనీ: కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆసిఫ్‌నగర్, శంకర్‌నగర్, దాయిబాగ్, మురాద్‌నగర్, జేబాబాగ్, విజయనగర్‌కాలనీ, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో భక్తులు తెల్లవారుజామునే వెళ్లి హరహర మహాదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, నిర్వహించి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. వివిధ ఆలయాల వద్ద ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

గుడిమల్కాపూర్‌లో...

అబిడ్స్: కార్తీకమాసం చివరి సోమవారం పూజలు గుడిమల్కాపూర్ సాయిబాబా త్రయంబకేశ్వర ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రవేళ భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. అభిషేకాలు రాత్రి వరకు కొనసాగాయి. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులతో ఆలయం సందడిగా మారింది. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు.


భవానీ సహిత శంకరాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

నాయకులు, కార్యకర్తలకు క్రమ శిక్షణ అవసరం


మజ్లిస్ నాయకులతో కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: నాయకులు, కార్యకర్తలకు క్రమ శిక్షణ అవసరమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో టోలిచౌకీ, నానల్‌నగర్, గోల్కొండ డివిజన్‌లకు చెందిన సీనియర్ మజ్లిస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మజ్లిస్ పార్టీపై నమ్మకం ఉంచి తనను కార్వాన్ ఎమ్మెల్యేగా మూడోసారి గెలిపించారన్నారు. ఈ గెలుపుతో ఓటర్లు మజ్లిస్ పార్టీని ఎంత ఆదరిస్తున్నారో స్పష్టమైందని ఆయన అన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయమని, దీని కోసం ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటామని తెలిపారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి గతంలో తాను నిర్వహించి ఇంటింటికి మజ్లిస్ పార్టీకి ఈ దఫా కూడా కొనసాగిస్తానని ఆయన పేర్కొన్నారు. అహ్మద్ బిన్ మోసిన్ బాకుల్కా, మతీన్ ఖాద్రీ, ఖదీర్ తదితరులున్నారు.

బాలికల వసతి గృహంలో సమస్యలు పరిష్కరించండి

గన్‌ఫౌండ్రీ: నిజాం కళాశాల బాలిక వసతి గృహంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాల ఎదుట విద్యార్థినులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ..బాలికల వసతి గృహంలో సమస్యలు విళలయతాండవం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన వసతులు లేకపోవడం వల్ల ఒక్క బెడ్డుపై ముగ్గురు విద్యార్థులు నిద్రించే పరిస్థితి అని కన్నీటి పర్యంతమయ్యారు. తమ సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపల్ దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినప్పటికి ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రస్తుత యాజమాన్యాన్ని తక్షణమే మార్చాలని డిమాండ్ చేశారు. బాలికల వసతి గృహంలో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని కళాశాల అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

'ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలుచేస్తుంది'


మాట్లాడుతున్న కార్వాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్‌హాజరీ

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలుచేస్తుందని కార్వాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్‌హాజరీ అన్నారు. సోమవారం ఆయన మెహిదీపట్నం, టోలిచౌకీ, కార్వాన్ తదితర ప్రాంతాల్లో మహిళల కోసం ఆర్టీసీ వారు ప్రవేశపెట్టిన మహాలక్ష్మి బస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా ప్రయాణికులతో మాట్లాడి మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కాగా మహిళలు గత రెండు రోజుల నుంచి తాము బస్సుల్లో ఉచితంగానే రాకపోకలు సాగిస్తున్నామని ఈ పథకంపై తమ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన నాలుగు రోజుల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు హామీలను పూర్తి చేశారని అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ప్రతినిత్యం తాను పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు మక్బూల్, అమ్జత్‌ఖాన్ తదితరులున్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు



చార్మినార్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసి అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతున్న సీఎం రేవంత్ రెడ్డి అభినందనీయులని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహమ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ కొనియాడారు. సోమవారం సాయంత్రం ఆయన రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఒకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను తప్పని సరిగా అమలుచేస్తుందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తారన్నారు. అలాగే పాతబస్తీలో గత దశాబ్ద కాలంగా అభివృద్ధి కుంటుపడిందని..సాధ్యమైనంత వెంటనే అభివృద్ధి కార్యక్రమాలను తిరిగి కొనసాగించాలని తాను సీఎం రేవంత్ రెడ్డిని కోరినట్లు మహమ్మద్ ముజీబుల్లా షరీఫ్ పేర్కొన్నారు.

భీమ్ ఆర్మీ చంద్రశేఖర్ ఆజాద్‌కు సన్మానం



అబిడ్స్: భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌కు బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. నగరానికి వచ్చిన ఆయనను గోషామహల్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ యువ నాయకుడు మేకల విష్ణువర్ధన్ ఆయనను సన్మానించి స్వాగతం చెప్పారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజలు


నూతన గోశాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, రాధాకృష్ణ, విజయభాస్కర్


పడిపూజలో తెలంగాణ అగ్రి ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దేవర రాజేశ్వర్, ప్రతినిధులు

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 18 అయ్యప్ప పడుల సామూహిక మహా పడిపూజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి బాస్ సంస్థ నిర్వాహకులు రాధాకృష్ణ ఆధ్వర్యంలో 18 పడులను ఏర్పాటు చేసి చూడముచ్చటగా మహా పడిపూజలు చేశారు. అయ్యప్పస్వామి భక్తి గీతాలు, భజనలతో రాత్రంగా ప్రాంతం మారుమ్రోగింది. ఈ మహా పడిపూజల కార్యక్రమాన్ని శబరిమల ఆలయ ప్రధాన మెల్‌శాంతి పూజారి విష్ణు సంభూత్రి వేద మంత్రోచ్చారణల మధ్య కొనసాగించారు. ఈ పూజా వేడుకల్లో రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ జాయింట్ ఐజీ వేముల శ్రీనివాస్ గుప్తా, పోలీస్ శాఖ డీఐజీ సుమతి, ఎమ్మెల్యే రాజాసింగ్ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ శైలజ, ప్రమోద, బాలల హక్కుల సంఘం పరిరక్షణ సభ్యురాలు బండి అపర్ణ, బాస్ అడ్వైజర్ దేవర రాజేశ్వర్, కట్ట మల్లేశం, కార్పొరేటర్లు జి.శంకర్‌యాదవ్, రాకేష్ జైస్వాల్, మీరాలమండి మహంకాళి ఆలయ చైర్మన్ గాజుల అంజయ్య, ప్రముఖ వ్యాపార వేత్త వీరేందర్ సింగాల్ పాల్గొని పూజలు చేశారు.

గోశాల బ్రోచర్ ఆవిష్కరణ..

నూతన గోశాల బ్రోచర్‌ను ఎమ్మెల్యే రాజాసింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాస్ సంస్థ అయ్యప్ప మహా పడిపూజలతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో 10 వేల లీటర్ల తాగునీటిని వాటర్‌ప్లాంట్ ద్వారా అందించడం అభినందనీయమన్నారు. 41 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు భోజనం, అల్పాహారాలు అందజేస్తున్నామన్నారు. శబరిమలలోని నీలకల్ వద్ద ప్రతిరోజూ లక్షలాది మంది అయ్యప్ప స్వాములకు భోజనాలు, అల్పాహారాలు, తాగునీళ్లు అందించడంతో ఎంతో అభినందనీయమన్నారు. స్వచ్ఛంద సంస్థలు బాస్ తరహాలో సమాజ సేవకు కృషి చేయాలని ఆయన కొనియాడారు.

అయ్యప్ప స్వాములకు అల్పాహారాలు..

గోషామహల్‌తో పాటు నగరం నుంచి పాల్గొన్న పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములకు అల్పాహారాలు పంపిణీ చేశారు. తీర్థప్రసాదాలు అందించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నెలకొంది.